సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం ı 3 ı సెప్టెంబర్ ı 2024



'మహా' నివాళి..
దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు.
9లో



ప్రాణాలే మిగిలాయి..
మణుగూరును భారీ వరదలు ముంచెత్తగా పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. సామగ్రి కొట్టుకుపోగా బాధితులు కట్టుబట్టలతో మిగిలారు.
8లో

గరిష్టం / కనిష్టం
27° / 24°

వాతావరణం
జిల్లాలో మంగళవారం వాతావరణం చల్లగా ఉంటుంది. పలు చోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

స్వల్పంగా పెరిగిన పామాయిల్ ధర

అశ్వారావుపేట: పామాయిల్ గెలల ధర స్వల్పంగా పెరిగింది. టన్నుకు రూ.564 పెరిగినట్టు ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజర్ సుధాకర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవలి వరకు టన్ను ధర రూ.13,828 ఉండగా, ప్రస్తుతం రూ.14,392కు పెరిగిందని ఆయన పేర్కొన్నారు. ధర పెంపుతో పామాయిల్ సాగు చేసే రైతుల్లో కొంతమేర హర్షం వ్యక్తమవుతోంది.

గోదావరి తగ్గుముఖం

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి క్రమంగా తగ్గుతూ 26.30 అడుగులకు చేరుకుంది. ఆదివారం రాత్రి 10 గంటలకు 29.60 అడుగులు ఉండగా సోమవారం ఉదయం 6 గంటలకు 27.40 అడుగులకు, 9 గంటలకు 27.10 అడుగులు, మధ్యాహ్నం 2 గంటలకు 26.60 అడుగులకు చేరుకోగా, సాయంత్రానికి 26.30 అడుగులకు తగ్గింది. కాగా, మంగళవారం ఉదయం నుంచి 6వ తేదీ వరకు మళ్లీ వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.

అధైర్య పడొద్దు.. ఆదుకుంటాం

- ఎంపీ బలరాం భరోసా

ఇల్లెందు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ అన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి ఇల్లెందులో విలేకరులతో మాట్లాడారు. వరదలతో తన పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరిగాయని, బాధితులకు భరోసాగా ఉంటామని హామీ ఇచ్చారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, నాయకులు దొడ్డా డానియేల్, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, బోళ్ల సూర్యం, సుదర్శన్ కోరీ, కిన్నెర నర్సయ్య, బానోతు రాంబాబు, చెన్నూరి కృష్ణ, శ్రీను ఉన్నారు.

విద్యుత్ శాఖకు రూ 20.10 లక్షల నష్టం

సూపర్‌బజార్(కొత్తగూడెం): భారీ వర్షాలతో జిల్లాలో విద్యుత్ శాఖకు రూ. 20.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఎస్‌ఈ జి.మహేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతంగా చేస్తున్నామని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో చెట్లు విరిగి పడడంతో 83 స్తంభాలు, 11 ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయని వివరించారు. వరదలతో నీట మునిగిన సబ్ స్టేషన్లు, పిడుగులు పడి దెబ్బతిన్న చోట మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సామగ్రి సరిపడా అందుబాటులో ఉందని, సిబ్బంది, అధికారులు 24 గంటలూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, మరే ఇతర సమస్యలున్నా 79016 28365 లేదా టోల్‌ఫ్రీ నంబర్లు 1912, 18004250028కు సమాచారం అందించాలని సూచించారు.

సెక్యూరిటీ జీఎంగా 'కోడూరు'

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సెక్యూరిటీ జీఎంగా వెల్ఫేర్ విభాగంలో ఏజీఎంగా విధులు నిర్వహిస్తున్న కోడూరు శ్రీనివాసరావును నియమిస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో సెక్యూరిటీ జీఎంగా పని చేసిన బీఆర్ దీక్షితులు ఆగస్టు 31న ఉద్యోగ విరమణ పొందారు. అలాగే పర్సనల్ జీఎం (ఐఆర్‌పీఎం)గా ఈఈ సెల్ జీఎంగా విధులు నిర్వహిస్తున్న కవితానాయుడుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏ సాయమైనా చేస్తాం



బొక్కలగడ్డలో వరద బాధితులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

- వరద తగ్గేవరకు బాధితులకు సహాయక చర్యలు
- అధికారులు, సిబ్బంది సెలవులు పెట్టొద్దు
- మున్నేరుకు 80 ఏళ్లలో రాని వరద వచ్చిందట..
- బొక్కలగడ్డ, రాజీవ్ గృహకల్ప ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలించాం
- బాధితులకు అభయమిచ్చేలా మంత్రులు క్షేత్రస్థాయిలో ఉండడం అభినందనీయం
- కలెక్టర్ ఖాతాలో అత్యవసర ఖర్చుల కింద రూ.5 కోట్లు

ఖమ్మంలో వరదలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'మీకు ఏ సాయం కావాలన్నా వెంటనే నష్టం అంచనాలు వేసి నివేదికలను నేరుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపండి. అక్కడ నుంచి నా దగ్గరకు వస్తాయి. ఎంత మేర నిధులు కావాలన్నా మంజూరు చేస్తాం. వరద తగ్గేవరకు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ బాధితుల కోసం సహాయక చర్యలు కొనసాగించాలి. అధికారులు, సిబ్బంది సెలవులు పెట్టొద్దు. పునరావాస కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి. పోలీసు శాఖలో ఇతర విభాగాల సిబ్బంది సేవలను కూడా ఉపయోగించుకోవాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు సూచించారు. ముఖ్యమంత్రి సోమవారం సాయంత్రం 4.50గంటలకు జిల్లాకు రోడ్డుమార్గంలో చేరుకున్నారు. ముంపునకు గురైన వివిధ ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం కలెక్టరేట్‌లో డిప్యూటీ సీఎం, మంత్రులు, కలెక్టర్‌తో కలిసి వరద ముంపుపై సమీక్షించారు.

పంటపొలాలు, గండిని పరిశీలించి..
పాలేరు రిజర్వాయర్ సమీపంలో ఎన్నెస్పీ కాల్వకు



వరదలో కొట్టుకుపోయిన సాగర్ కాల్వ కట్టను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి

పడిన గండిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి సీఎం పరిశీలించారు. హట్యాతండా వద్ద పాలేరు వాగుతో నీట మునిగిన పంట పొలాలను కూడా సీఎం చూశారు. ఆపై ఖమ్మం రూరల్ మండలంలోని రాజీవ్ గృహకల్ప వద్దకు చేరుకున్నారు. ఇక్కడ వరద చేరుకున్న రెండు ఇళ్లలోకి వెళ్లి బాధితులతో మాట్లాడారు. అనంతరం ఖమ్మంలోని బొక్కలగడ్డ, మంచికంటి నగర్‌లోకి ఓపెన్‌టాప్ వాహనంలో వెళ్లి మున్నేరు వరదతో నీట మునిగిన కాలనీలను పరిశీలించారు. ఆ తర్వాత కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడగా ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

ఇది 80 ఏళ్ల క్రితం వరదంటా..
మున్నేరు, ఆకేరు, పాలేరు వరదలతో.. పాలేరు, ఖమ్మం, మధిర నియోజకవర్గాల్లోని పరీవాహక మండలాల్లో ప్రభావం చూపింది. ఈ పరీవాహకం

సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జిల్లాలో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించడంతో పాటు సీఎం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఆ తర్వాత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసంలో బస చేశారు. మంగళవారం ఉదయం ఆయన కారేపల్లి మండలం గంగారం తండాకు వెళ్తారు. ఆకేరు వరదలో మృతి చెందిన తండ్రీకుమార్తె మోతీలాల్, అశ్విని కుటుంబీకులను పరామర్శించి, మహబూబాబాద్ జిల్లాకు బయలుదేరుతారు.

లోని ఇళ్లు నీట మునగడంతో పాటు పంటలు బాగా దెబ్బతిన్నాయి. అయితే 80 ఏళ్ల క్రితం ఇలా వరద వచ్చిందని రాజీవ్ గృహకల్ప వద్ద పెద్ద మనుషులు చెప్పారు. ఇంతటి ఉపద్రవం ఎప్పుడు రాలేదట.. వరదలతో ఇళ్లల్లోకి చెత్తాచెదారం, బురద వచ్చింది. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా వరద బాధితులకు సహకరించేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలోకి వెళ్లి పూర్తి స్థాయిలో నివేదికలు రూపొందించాలి. ఎక్కడెక్కడ నష్టం వాటిల్లిందో నివేదికలు ఇవ్వాలి.

రేషన్, ఆధార్ వివరాలు సేకరించాలి..
వరద బాధితుల ఆధార్, రేషన్ కార్డుల వివరాలు సేకరించాలి. 34 పునరావాస కేంద్రాల్లో సరైన వసతులు కల్పించాలి. వరదలో బియ్యం, దుప్పట్లు, సర్టిఫికెట్లు కూడా కొట్టుకుపోయాయి. శాఖల వారీగా ఈ నివేదికలు రూపొందించాలి. బాధితులకు ప్రభుత్వం అండగా ఉందన్న విశ్వాసం కల్పించేలా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళ్లాలి. బాధితులకు తక్షణ సాయంగా ప్రకటించిన రూ.10 వేలు వెంటనే అందించాలి.

అన్ని శాఖలను వినియోగించుకోండి..
జిల్లాలోని అన్ని శాఖల సేవలు ముంపు ప్రాంతాల్లో వినియోగించుకోండి. ప్రభుత్వం అందించే సాయం బాధితులకు వెంటనే చేరాలి. తక్షణ సాయం కోరుతూ తయారు చేసిన నివేదికలను నేరుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపించండి. తద్వారా నేరుగా జిల్లాకు రావాల్సిన సాయం అందుతుంది.

మంత్రుల సేవలు భేష్..
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వరద ముంపుపై అప్రమత్తమై ప్రజాక్షేత్రంలోకి వెళ్లారు. వరద సహాయక చర్యల్లో నేరుగా పాల్గొని ఎప్పటికప్పుడు నాతో పాటు ఉన్నతాధికారులకు సమాచారం చేరవేసి సహాయక చర్యలు తీసుకున్నారు. వారి సేవలు అభినందనీయం.



ఖమ్మం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, తుమ్మల, కోమటిరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి



భారీ వరదలతో నీట మునిగిన మణుగూరు పట్టణం

మణుగూరుకు 'బర్డెనే'

- సింగరేణి మట్టిగుట్టలతోనే వరదపోటు
- పట్టణానికి సమాంతరంగా వెలిసిన గుట్టలు
- భారీ వర్షం కురిస్తే తప్పని తిప్పలు
- తాజాగా మోగిన మొదటి ప్రమాద హెచ్చరిక

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఓపెన్‌కాస్ట్ గనుల కారణంగా ఏర్పడుతున్న మట్టి గుట్టలు (ఓబీ) ప్రకృతి విపత్తులకు నిలయంగా మారుతున్నాయి. ఇందుకు సంబంధించిన మొదటి ప్రమాద హెచ్చరికలు మణుగూరులో మోగాయి.

కృత్రిమ గుట్టలు..
గోదావరి తీరంలో ఉన్న మణుగూరు కేంద్రంగా 1975 నుంచి సింగరేణి సంస్థ బొగ్గు తవ్వకాలు చేపట్టడంతో గ్రామంగా ఉన్న మణుగూరు పట్టణంగా రూపాంతరం చెందింది. ఇక్కడ ఎక్కువగా ఓపెన్ కాస్ట్ మైనింగ్ చేయడంతో పట్టణానికి ఎగువన ఓవర్ బర్డెన్ మట్టి కుప్పలతో కృత్రిమ గుట్టలు ఏర్పాటయ్యాయి. తోగ్గూడెం నుంచి విజయనగరం వరకు నాలుగు కిలోమీటర్లు ప్రధాన రహదారికి ఇరువైపులా మణుగూరు పట్టణం విస్తరించి ఉండగా దిగువ భాగంలో పొలాలు, గోదావరి నది, ఎగువ భాగంలో ఓపెన్‌కాస్టులతో ఏర్పడిన కృత్రిమ గుట్టలు ఉన్నాయి. ఇవి పట్టణానికి సమాంతరంగా ఐదు కిలోమీటర్ల పొడవున విస్తరించాయి. ఈ ఓవర్ బర్డెన్ మట్టి కుప్పలతో ఏర్పడిన గుట్టలపై భారీ ఎత్తున మొక్కలు నాటడం ద్వారా సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడుతోంది. అయితే ఈ గుట్టలపై కురిసే వర్షం కారణంగా వచ్చే వరదకు సరైన విధంగా డ్రెయినేజీ సిస్టం ఏర్పాటు చేయడంపై ఆ సంస్థ ఏ మాత్రం శ్రద్ధ పెట్టలేదు.

పూడిక తీయలేదు..
ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద పట్టణానికి ఇరువైపులా ఉన్న కోడిపుంజుల వాగు, గొర్రెపేట వాగుల ద్వారా గోదావరిలో కలుస్తోంది. వీటితో పాటు పట్టణంలో వెలువడే మురుగునీరు కట్ట వాగు, మెట్టవాగు పేరుతో ఉన్న రెండు నాలాల ద్వారా దిగువన ఉన్న గోదావరి వైపునకు వెళ్తున్నాయి. అయితే గడిచిన పదేళ్లలో కట్ట, మెట్ట వాగుల్లో రెండేళ్ల క్రితం ఒకసారి మాత్రమే పూడిక తీసిన మున్సిపాలిటీ అధికారులు ఆ తర్వాత శ్రద్ధ పెట్టలేదు. కనీసం వాగులో పేరుకుపోయిన చెత్త, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు వంటి కనీస స్థాయి చర్యలు కూడా తీసుకోలేదు. దీంతో ఈ రెండు నాలాలు ఇరుకుగా మారాయి. మరోవైపు పట్టణం విస్తరించడంతో కోడిపుంజుల వాగు చుట్టూ ఇళ్లు, కాలనీలు వెలిశాయి.

భారీ వర్షం రావడంతో..
ఇన్నేళ్లు సాధారణ స్థాయిలో వర్షాలు పడడంతో మట్టి గుట్టలతో మణుగూరుకు ఉన్న ముప్పు బయట పడలేదు. కానీ గత శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు రికార్డు స్థాయిలో నాలుగైదు గంటల్లోనే 31 సెంటీమీటర్ల వర్షపాతం ఇక్కడ నమోదైంది. దీంతో పట్టణం ఎగువన సింగరేణి ఓపెన్‌కాస్ట్‌తో ఏర్పడిన కృత్రిమ గుట్టలపై పడిన వర్షం వరదగా మారింది. సింగరేణి ఏర్పాటు చేసిన తాత్కాలిక వరద మార్గం పైనుంచి నీళ్లు ప్రవహించడంతో ఎక్కడికక్కడ కట్టలు తెగిపోయాయి. ఈ నీరంతా కట్టవాగు, మెట్టవాగు, కోడిపుంజుల వాగుల్లోకి మళ్లింది. దీంతో ఒక్కసారిగా నాలాలు అంచులు దాటి ప్రవహించి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను ముంచేశాయి.

బాధ్యత ఎవరిది..
ప్రస్తుత అనుభవాల నేపథ్యంలో భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మణుగూరు పట్టణ వాసులు కోరుతున్నారు. ఎగువ ప్రాంతంలో పట్టణానికి సమాంతరంగా వెలిసిన మట్టి గుట్టలపై చెట్లు నాటడంతో తమ బాధ్యత తీరిపోయినట్టుగా సింగరేణి వ్యవహరించడం సరికాదని అంటున్నారు. భవిష్యత్‌లో భారీ వర్షాల నుంచి పట్టణానికి వరద భయం లేకుండా శాస్త్రీయ పద్ధతిలో వరద నీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే పదేళ్లుగా కట్ట, మెట్టవాగుల్లో పూడిక తీయని మున్సిపల్ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని అంటున్నారు.

తప్పిన ముప్పు..
గాఢ నిద్రలో ఉన్న సమయంలో వరద నీరు ఇళ్లను ముంచెత్తడంతో ఎక్కడి సామాన్లు అక్కడే వదిలి ప్రజలంతా భయంతో ఇళ్ల పైకప్పులు ఎక్కడం, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లడంతో ప్రాణాలు కాపాడుకున్నారు. అయితే మెట్ట, కట్ట వాగులకు గతంలోనే చాలా భాగం వరకు సిమెంట్ రివిట్‌మెంట్ వేయడం, శనివారం అర్ధరాత్రి మొదలైన జోరువాన ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే నెమ్మదించడంతో ఉగ్రరూపం దాల్చిన వరద కొన్ని గంటల వ్యవధిలోనే వెనక్కి తగ్గింది. లేదంటే భారీగా ఆస్తి, ప్రాణనష్టం సంభవించి ఉండేది.

మృతుల కుటుంబాలకు పరిహారం

రూ.5 లక్షల చొప్పున అందించిన కలెక్టర్, ఎమ్మెల్యే

మణుగూరు టౌన్/అశ్వాపురం : పినపాక నియోజకవర్గాన్ని వరద ముంచెత్తగా ఆ ధాటికి ముగ్గురు మృతిచెందిన విషయం తెలిసిందే. మణుగూరులోని మేదరబస్తీకి చెందిన దివ్యాంగుడు నందికొళ్ల రాము ఇంట్లోకి వరద నీరు చేరి మృత్యువాత పడగా ఆయన తల్లి రత్నమ్మకు ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారం రూ.5 లక్షల చెక్కును కలెక్టర్ జితేష్ వి పాటిల్, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలిసి సోమవారం అందజేశారు. అలాగే అశ్వాపురం మండలం వెంకటాపురంలోని తోగువాగులో గల్లంతై మృతి చెందిన కల్లూరి నీలమయ్య, తాటి ఆదెమ్మ కుటుంబాలకు మొండికుంటలో జరిగిన



అశ్వాపురం : మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కార్యక్రమంలో రూ.5 లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో ఒక్కరోజే అతి భారీ వర్షం కురవడంతో పలు ఇళ్లు నీట మునిగాయని, పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ ఘటన బాధాకరమని అన్నారు. అన్ని శాఖల అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు అండగా ఉండేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పరిహారం అందించాలని నిర్ణయించారని, గత ప్రభుత్వం రూ.4లక్షలు ఇస్తే, ఇప్పుడు రూ.లక్ష అదనంగా అందిస్తున్నామని చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పక్షాన అండగా ఉంటామన్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు రాఘవరెడ్డి, స్వర్ణలత, ఎంపీడీఓలు శ్రీనివాసరావు, వరప్రసాద్, ఆర్‌ఐలు నాగమణి, రాజేశ్వరరావు, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత, మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ కమటం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో వినతులు స్వీకరించిన కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో సమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొత్తగూడెం రైతుబజార్ వద్ద నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఎదుట మున్సిపల్ మార్కెట్ నిర్మిస్తే కొనుగోలుదారులకు ఇబ్బందిగా ఉంటుందని, పార్కింగ్ స్థలం, వ్యాపారుల అవసరాలకు కేటాయించాలని కూరగాయల వ్యాపారులు దరఖాస్తు చేయగా మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు. చుంచుపల్లి మండలం 4ఇంక్లైయిన్ పంచాయతీలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని మాస్‌లైన్ నాయకుడు పి.సతీష్ దరఖాస్తు చేశారు. జిల్లా కేంద్రంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, బస్టాండ్ ఎదుట నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ నిర్మాణం చేస్తున్నారని, సెయింట్ మేరీస్ స్కూల్ ఎదుట అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని పలువురు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనలో యూడీఎస్‌ఈ కీలకం..
పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు యూడీఎస్‌ఈ కీలకమని కలెక్టర్ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లాస్థాయి లైన్ డిపార్ట్‌మెంట్ల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు తమ విద్యాసంస్థల పూర్తి వివరాలను నిర్ణీత సమయంలో నింపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల యదార్థ స్థితిని పారదర్శకంగా నింపగలిగితే ప్రభుత్వం నుంచి మంజూరయ్యే సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. యూడీఎస్‌ఈ ఫార్మాట్‌లోని ప్రతి అంశంపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించాలని డీఈఓకు సూచించారు. సమావేశంలో డీఈఓ ఎం వెంకటేశ్వరాచారి, ఐటీడీఏ డీడీ మణెమ్మ, డీఐఈఓ వెంకటేశ్వరరావు, మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు, విద్యాశాఖ కోఆర్డినేటర్లు



ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

ఎస్. సతీష్‌కుమార్, ఎస్‌కే సైదులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలపై దృష్టి సారించాలి..
గోదావరి ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రాబోయే రెండు రోజుల్లో నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని, అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరిస్తా

కొత్తగూడెంరూరల్: జిల్లా ఆస్పత్రిలో సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని కలెక్టర్ పాటిల్ అన్నారు. సోమవారం ఆయన ఆస్పత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే పేషెంట్లు, వారి సహాయకులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ఆస్పత్రి ఎదుట ఉన్న డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మందుల కొరత, ఎక్స్‌రే మిషన్ మరమ్మతు వంటి సమస్యలపై నివేదిక అందించాలని ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్‌కు ఆదేశించారు. ఎంసీహెచ్‌లో సేవలు సక్రమంగా అందడం లేదని, వైద్యులు, సిబ్బంది దురుసుగా మాట్లాడుతున్నారని పేషెంట్లు కలెక్టర్ దృష్టికి తేగా.. ఆ సమస్య లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆర్‌ఎంఓ రమేష్ తదితరులు ఉన్నారు.

పంటలు వర్షార్పణం



రెడ్డిపాలెంలో మట్టి మేటలతో దెబ్బతిన్న పత్తిచేను

- కోతకు గురైన భూములు
- మరికొన్ని చోట్ల చేలల్లో మట్టి మేటలు
- సర్కారు ఆదుకోవాలని రైతుల వేడుకోలు

బూర్గంపాడు: మూడు నెలలుగా కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలను భారీ వర్షం తుడిచిపెట్టింది. గోదావరి వరదలు ముంచెత్తినప్పుడు కూడా ఇంత నష్టం వాటిల్లలేదని, వరద తీవ్రతకు మొక్కలు ఎక్కడున్నాయో, గట్లు ఎక్కడున్నాయో కూడా తెలియడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొన్నిచోట్ల భూములు కోతకు గురై మొక్కలను వేళ్లతో సహా పెకిలించాయి. మరికొన్ని చోట్ల మట్టి, ఇసుక మేటలు వేసింది. దీంతో ఇప్పటికే వేల రూపాయలు పెట్టిన రైతులు లబోదిబోమంటున్నారు. తిరిగి పంటలు వేయడమేమో కానీ, కోతకు గురైన, మేటలు వేసిన భూములను బాగు చేయాలంటేనే రూ.లక్షలు కావాలని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

తెగిన చెరువులు, కుంటలు..
జిల్లాలో కురిసిన అతి భారీ వర్షంతో పలుచోట్ల చెరువులు, కుంటలు తెగిపోయాయి. వాగులు పొంగి ప్రవహించాయి. వరద ఉధృతికి పంటలు నీటమునిగాయి. సుమారు 3వేల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ శాఖ చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే సుమారు 20వేల ఎకరాల్లో పత్తి, వరి, మిర్చి తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఆదివారం వరద ఉధృతి కారణంగా చేలు నీటిలోనే ఉండగా సోమవారం రైతులు పొలాలకు వెళ్లి చూస్తే పత్తి మొక్కలు ఎక్కడున్నాయో, వరి దుబ్బులు ఎక్కడున్నాయో, చేలగట్లు ఎక్కడున్నాయో తెలియని దయనీయ పరిస్థితి నెలకొంది. పత్తి, మిర్చి మొక్కలు వేళ్లతో సహా కోతకు గురయ్యాయి. వరి మాగాణులు వరద ఉధృతికి గురై బాగా దెబ్బతిన్నాయి.

పదెకరాలు కౌలుకు తీసుకున్నా

పదెకరాల భూమి కౌలుకు తీసుకుని వరి సాగు చేశా. శనివారం రాత్రి కురిసిన వర్షానికి పెదవాగు పొంగి రెండకరాల పొలం కోతకు గురైంది. వరి నార్లు నీట మునిగి పాచిపోయాయి. కౌలుకు తీసుకున్న భూమి కోతకు గురై పంటనష్టం జరగడంతో ఏం చేయాలో తెలియడం లేదు.
– యడమకంటి రవీందర్‌రెడ్డి, నాగినేనిప్రోలు

పత్తి మొక్కలు ధ్వంసమయ్యాయి

మేం చెరో ఆరెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాం. ఇప్పటికే ఎకరానికి రూ.25 వేల మేర పెట్టుబడి పెట్టాం. శనివారం రాత్రి వచ్చిన వరద పత్తి మొక్కలను వేళ్లతో సహా పెకిలించింది. చేనులో మట్టి మేటలు వేసింది. మట్టిని తొలగించడంతో పాటు ఇప్పటికే పెట్టుబడి ఖర్చు మొత్తం ఒక్కొక్కరికి రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లింది.
– తలకోల శ్రీనివాసరెడ్డి, అవినీడి పవన్, రెడ్డిపాలెం

క్లుప్తంగా

మరమ్మతులు చేపడతాం

ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర రెడ్డి



బ్రిడ్జి వద్ద పరిశీలిస్తున్న అధికారులు

కరకగూడెం: చిరుమళ్ల బ్రిడ్జి రహదారికి మరమ్మతులు చేపడతామని భద్రాచలం ఎస్ఈ వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. భారీ వర్షాలు, వరదలతో రోడ్డు కోతకు గురై ప్రమాదభరితంగా మారింది. దీంతో సోమవారం పలు శాఖల అధికారులు బ్రిడ్జిని, దెబ్బతిన్న రహదారిని పరిశీలించారు. కోతకు గురైన ప్రాంతంలో ట్రాక్టర్ ద్వారా గ్రావెల్ తోలి తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పట్టాక పూర్తిస్థాయిలో బ్రిడ్జికి మరమ్మతు పనులు చేపడతామన్నారు. వివిధ శాఖల అధికారులు తెల్లం వెంకటేశ్వర రావు, రమేష్ బాబు, రామనాథం, వెంకటేశ్వరరావు, నాగ ప్రసాద్, సక్రు నాయక్, రాజేందర్‌తోపాటు నాయకులు ఎర్ర సురేష్, చందా మధు పాల్గొన్నారు.

నిమజ్జనం ఘాట్ పరిశీలన



నిమజ్జనం ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ అంకిత్ కుమార్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద గోదావరి నదిలో గణపతి నిమజ్జనాల కోసం ఏర్పాటు చేసే ఘాట్‌ను ఏఎస్పీ అంకిత్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి తీరంలో పార్కింగ్, నిమజ్జన ప్రదేశాల వద్ద ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. నిమజ్జనం రోజు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ మధుప్రసాద్ పాల్గొన్నారు.

లాడ్జిల్లో ఏఎస్పీ తనిఖీలు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని లాడ్జిల్లో సోమవారం భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్ తనిఖీలు నిర్వహించారు. బస చేసిన వ్యక్తుల వివరాలు ఆరా తీశారు. ఆధార్ కార్డులు, ఇతర వివరాల కోసం రిజిస్టర్ నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. చట్టవిరుద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వొద్దని, లాడ్జి పరిసరాలు స్పష్టంగా కన్పించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లాడ్జిల్లో బస చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

లేత గెలలు అశ్వారావుపేట ఫ్యాక్టరీకి..

అశ్వారావుపేటరూరల్: కొత్తగా దిగుబడి వస్తున్న ఆయిల్‌పామ్ తోటల్లోని లేత గెలలను అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీకి తరలించాలని ఆయిల్‌ఫెడ్ జీఎం టి.సుధాకర్‌రెడ్డి సూచించారు. ఐదు నుంచి ఎనిమిదేళ్ల లోపు వయస్సు గల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, గద్వాల, జనగామ, సిద్దిపేట, నారాయణపేట జిల్లాల్లోని తోటల్లో ప్రస్తుతం దిగుబడి వస్తోందని తెలిపారు. ఈమేరకు లేత తోటల్లోని గెలలను అశ్వారావుపేట ఫ్యాక్టరీకి తరలించి సాగుదారులు సహకరించాలని జీఎం కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



హరిబాబు (ఫైల్)

దుమ్ముగూడెం: భద్రాచలం పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మండల పరిధిలోని సీతానగరం గ్రామానికి చెందిన పూనెం హరిబాబు (31) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. స్వగ్రామంలోని బంధువుల ఇంట్లో దశదిన కర్మలకు హాజరై ఆదివారం రాత్రి తిరుగు పయనమయ్యాడు. ద్విచక్రవాహనంపై భద్రాచలం వెళ్లగా, పట్టణంలోని పాత మార్కెట్ వద్ద ఉన్న డివైడర్‌కు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

కేజీబీవీలో గోడలకు విద్యుత్ ప్రసారం

కొణిజర్ల: కొణిజర్ల మండలం బస్వాపురం సమీపాన ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గోడలకు విద్యుత్ సరఫరా అవుతోంది. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కేజీబీవీలో ఎర్త్ అవుతూ బాలికల డార్మిటరీ గదిలో గోడలకు విద్యుత్ ప్రసరిస్తోంది. దీంతో శని, ఆదివారాలలో బాలికలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఈ నేపథ్యాన సోమవారం ఉదయం మరింత ప్రమాదకరంగా ఉండడంతో పిల్లల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఇంటికి పంపించారు. ఈవిషయమై ఎస్‌ఓ సౌజన్యను వివరణ కోరగా డార్మిటరీలో ఓ కిటికీకి విద్యుత్ ప్రసరిస్తున్న మాట నిజమేనని తెలిపారు. అయితే, పిల్లలను ఇంటికి పంపడానికి ఇది కారణం కాదని చెప్పారు. మున్నేరు వరదతో ఖమ్మంలోని పలుచోట్ల ఇళ్లు నీట మునగగా ప్రభుత్వ సాయం కోసం ఫొటోలు దిగాలని తల్లిదండ్రులు కోరడంతో పంపించామని తెలిపారు. అంతేకాక ఎలక్ట్రీషియన్‌ను పిలిపించి వైర్లు చేయిస్తున్నామని ఆమె వెల్లడించారు.

ప్రాణాలే మిగిలాయి..



వరద ముంపునకు కూలిన ప్రహరీ, దెబ్బతిన్న సామగ్రి

- అర్ధరాత్రి వరదతో సర్వం కోల్పోయాం
- మణుగూరు మున్సిపాలిటీలో ముంపు ప్రాంత ప్రజల ఆవేదన
- దెబ్బతిన్న ఇళ్లు, కూలిపోయిన గోడలు
- నీట మునిగి పాడైన గృహోపకరణాలు
- వరద తగ్గినా బురద పేరుకుని అవస్థలు

మణుగూరు టౌన్: మణుగూరు మున్సిపాలిటీ కన్నీటి వేదనకు గురవుతోంది. అర్ధరాత్రి ఇళ్లల్లోకి నాలుగైదు అడుగుల మేర వరద నీరు చేరడంతో బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఇళ్లు దెబ్బతిన్నాయి. వరద నీరు చేరి బావులు కలుషితంగా మారాయి. కార్లు, బైక్‌లు కొట్టుకుపోయాయి. వరద ప్రవాహం ఆదివారం ఉదయం 8 గంటలకు తగ్గినా.. ఆ వేదన నుంచి పట్టణవాసులు కోలుకోలేకపోతున్నారు. తాగునీరు కూడా కరువైంది. ఇళ్లను శుభ్రం చేసుకోవడం తలకుమించిన భారంగా మారింది. దుస్తులు, ఆహారం లేక నిస్సహాయ స్థితిలో మిగిలారు. ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకుంటూ తడిసిన వస్తువులను, నిల్వ ఉంచుకున్న బియ్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. గత 30 ఏళ్లలో కనీవినీ ఎరుగని వాన వచ్చిందని చెబుతున్నారు. పర్యటిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధుల ఎదుట ఆవేదన వెలిబుచ్చుతున్నారు. రేగులగండి, సింగరేణి గనుల వైపు నుంచి వచ్చిన వరద ప్రవాహం సుందరయ్య నగర్, కుంకుడుచెట్ల గుంపు, మేదరబస్తీ కట్టువాగు మెట్లవాగులపై ప్రభావం చూపింది. వరద నీటితో ఆదర్శనగర్ నుంచి చాకలి ఐలమ్మ నగర్ వరకు ముంపునకు గురైంది. దీంతో నీటిలో నాని ఇళ్ల గోడలు కూలిపోయాయి. పశువులు కొట్టుకుపోయాయి. సామగ్రి తడిసి పాడైపోయింది. దాచుకున్న నగదు, బంగారం కొట్టుకుపోయాయి. ఆయా ప్రాంతాల ప్రజలు ప్రాణాలు కాపాడుకున్నా నిరాశ్రయులుగా మిగిలిపోయారు. పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



తడిసిన సర్టిఫికెట్లు, దుస్తులను ఇంట్లో ఆరబెట్టుకున్న బాధితుడు

పూడిక తీయకనే..



కట్టువాగుకు చుట్టూ గోడ నిర్మించి వరద మేదరబస్తీకి రాకుండా నిరోధించాలి. కట్టువాగు పూడికతీయక ఐదేళ్లు దాటింది. పూడిక తీసి ఉంటే ఇంత నష్టం జరిగేగి కాదు. మా ఇంట్లోకి ఐదు అడుగుల మేర చేరిన వరద తెల్లారికి తగ్గింది. ఇప్పటికే పశువులు కోల్పోయాం, బైక్ కొట్టుకుపోయి నిండా మునిగాం. పక్కా ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

–తన్నీరు విజయ, మేదరబస్తీ

ఇంటి నిండా బురద



అర్ధరాత్రి వరద రావడంతో ఇంట్లోని వస్తువులు అన్ని కొట్టుకుపోయాయి. దుస్తులు, పరుపులు తడిసిపోయాయి. బిందెలు, బకెట్లు, గ్యాస్ బండలు కొట్టుకుపోయాయి. సోమవారం ఆహారం వండుకునేంటుందుకు వంట సామాన్లు కూడా లేవు. ఇల్లు శుభ్రం చేస్తున్నా మురుగు వాసన పోవడం లేదు. బురద నిలిచిన ఇంటిని వదిలేసి ఎలా వెళ్లాలి.

–మహబూబి, సుందరయ్యనగర్

పొంగిపొర్లుతున్న జలాశయాలు



అలుగుపోస్తున్న ఎర్రసాని చెరువు

- జిల్లాలోని మొత్తం చెరువులు 2,364
- ప్రస్తుతం అలుగు పోస్తున్నవి 2,009
- 100 శాతం నిండిన చెరువులు 355

పాల్వంచరూరల్: రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయాలు నిండి పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల చెరువులు జోరుగా అలుగు పోస్తున్నాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 2,364 చెరువులు ఉండగా 2,009 చెరువులు నిండి అలుగు పోస్తున్నాయి. 355 చెరువులు 100 శాతం నిండాయి. తాలిపేరు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 730 ఎంసీఎఫ్‌టీ కాగా, ప్రస్తుతం నీరు 303 ఎంసీఎఫ్‌టీగా నమోదైంది. ఈ ప్రాజెక్ట్ కింద 24,700 ఆయకట్టు సాగువుతోంది. కిన్నెరసాని ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 407 అడుగులుకాగా ప్రస్తుత నీటిమట్టం 405.20 అడుగులకు చేరింది. ఆయకట్టు 10 వేల ఎకరాలు ఉంది. ములకలపల్లిలోని మూకమామిడి ప్రాజెక్ట్ కూడా జలకళ సంతరించుకుంది. అశ్వారావుపేటలోని పెదవాగు నీటి నిల్వ సామర్థ్యం 557.890 ఎంసీఎఫ్‌టీ కాగా ప్రస్తుతం 75.14 ఎంసీఎఫ్‌టీ మేర నీరు ఉంది. గత జూలైలో వచ్చిన భారీ వర్షాలు, వరదలకు పెదవాగు ప్రాజెక్ట్ ఆనకట్ట తెగిపోయిన విషయం విదితమే. కాగా గతేడాది కంటే ఈసారి వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటలు నిండాయని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. వానాకాలం సీజన్ తోపాటు రబీ సీజన్‌లో కూడా పంటలకు సాగునీటి ఢోకా లేదని పేర్కొంటున్నారు.



కిన్నెరసాని రిజర్వాయర్‌లో జలకళ

చెరువులన్నీ నిండాయి



గతేడాది కంటే వర్షాలు బాగా కురుస్తున్నాయి. భారీ వర్షాలతో జిల్లాలో చెరువులు, జలాశయాలు వందశాతం నిండాయి. రెండు రోజులు కురిసిన భారీ వర్షాలకు ఎక్కువశాతం చెరువులు అలుగు పోస్తున్నాయి. తాలిపేరు, కిన్నెరసాని, పెదవాగు జలాశయాలకు గతేడాది కంటే అధికంగా వరద నీరు వచ్చింది. జిల్లాలోని చెరువులన్నీ నిండాయి.

– శ్రీనివాసరెడ్డి, జలవనరులశాఖ సీఈ

పాఠశాలల్లో అప్రమత్తంగా ఉండాలి

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్

భద్రాచలం: భారీ వర్షాల నేపథ్యాన పాఠశాలల్లో విద్యార్థుల విషయమై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్ పాల్గొన్న ఆయన వివిధ ప్రాంతాల గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. కాగా, వర్షాలు కురుస్తున్నందున వసతిగృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. తరచుగా వైద్యపరీక్షలు చేయించి అవసరమైన వారిని ఆస్పత్రిని తీసుకెళ్లాలని చెప్పారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు, వివిధ శాఖల అధికారులు తానాజీ, నరేష్, మునీర్‌పాషా, ఆర్.శ్రీనివాస్, ఆదినారాయణ, ప్రమీలబాయి, నారాయణరావు, ప్రభాకర్‌రావు, లింగానాయక్, ముదిరాజు, హరికృష్ణ, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

రుణాల మంజూరులో వసూళ్ల దందా

చండ్రుగొండ: మండలంలో గ్రూపుల వారీగా చేతి వృత్తుల కోసం రుణాలిస్తున్న ఓ ప్రైవేటు బ్యాంకు సిబ్బంది వసూళ్ల దందాకు తెరలేపారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం మండలంలోని బాల్యాతండాలో రికవరీకి వచ్చిన సిబ్బందిని బాధితులు అడ్డుకున్నారు. రుణాల మంజూరులో తొలుత రూ.1500 వసూలు చేశారని, అనంతరం ఇన్సూరెన్స్‌తోపాటు డాక్యుమెంట్ ఖర్చుల కోసం రూ.2,500 తీసుకున్నారని పేర్కొన్నారు. గ్రూపులో ఒక్కొక్కరికీ రూ.50 వేలు మంజూరు చేశారు. అయితే రుణాలు మంజూరయ్యాక హైదరాబాద్‌లోని బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి రుణగ్రస్తులకు ఫోన్‌లు వచ్చాయి. తాము తొలుత రూ.1,500 కట్టామని బాధితులు చెప్పడంతో బ్యాంకు అధికారులు తమకు సంబంధం లేదని సమాధానం ఇచ్చారు. దీంతో సిబ్బంది వసూళ్ల దందా బయటపడింది. బాల్యాతండాతోపాటు కడిశెలబోడు, సామ్యాతండా, వెంకటియా తండా, పోకలగూడెం గ్రామాల్లో ఓ ప్రైవేటు బ్యాంకు గ్రూపుల వారీగా రుణాలిస్తోంది. ఓ వ్యక్తిని మధ్యవర్తిగా ఉంచి బ్యాంకు సిబ్బంది అదనంగా రూ.1,500 వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఈ క్రమంలో సిబ్బంది ద్విచక్ర వాహనాన్ని బాధితులు అడ్డుకున్నారు. గ్రామపెద్దలు సర్దిచెప్పడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది.



బ్యాంకు సిబ్బందిని అడ్డుకున్న బాధితులు

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

పాల్వంచ: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బీసీఎం రోడ్‌లోని జీసీసీ కార్యాలయం వద్ద తనిఖీలు చేపట్టిన పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో రాహుల్ గాంధీనగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ మసూదర్ రెహమాన్ ఒడిశా నుంచి గంజాయి తెచ్చి ఇందిరా కాలనీకి చెందిన ఎస్‌కె.యాకూబ్ పాషా, నక్కా అజయ్‌లకు అమ్ముతున్నట్లు తేలింది. వారి నుంచి 3.4కేజీల గంజాయి, రెండు మోటార్ సైకిళ్లు, 3 సెల్‌ఫోన్‌లు, రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

లక్ష్మీదేవిపల్లిలో మరో 3.5 కేజీలు?

పాల్వంచరూరల్: వాహనంలో తరలిస్తున్న గంజాయితోపాటు ఇద్దరు స్మగ్లర్లను సోమవారం పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి వద్ద ఎస్‌ఐ బి.సురేష్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో పాల్వంచ వైపు వెళ్తున్న వాహనంలో 3.5 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్‌ఐ సురేష్‌ను వివరణ కోరగా.. విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

డీసీసీబీ అక్రమాలపై విచారణ

- ఇంక్రిమెంట్లు, బదిలీలు, ఆడిట్, రైతుబీమాపై ఆరా
- త్వరలోనే చర్యలకు రంగం సిద్ధం?

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ)లో పలు అంశాలపై ఆరోపణల నేపథ్యాన సహకార శాఖ, రాష్ట్ర సహకార బ్యాంక్(టీజీ క్యాబ్) వేర్వేరుగా విచారణ చేపట్టాయి. డీసీసీబీ సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ పాలకవర్గంతో ప్రమేయం లేకుండా పలు అంశాలపై నిర్ణయం తీసుకున్నారని, ఇందులో అవినీతి జరిగిందని చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, డైరెక్టర్లు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేయడంతో ఆయన సమగ్ర విచారణకు ఆదేశించారు. బ్యాంకులో 90 మంది ఉద్యోగులు, అధికారులకు బకాయి ఉన్న రూ.78 లక్షల మేర ఇంక్రిమెంట్లు, ఇతర ప్రోత్సాహకాల చెల్లింపు, అధికారులు, ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు, నెలవారీ ఆడిట్ ఖర్చుల రెట్టింపు, రైతుల జీవిత బీమా వ్యవహారంలో అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయి. దీంతో సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ అవధానుల శ్రీనివాస్‌ను విచారణ అధికారిగా నియమించగా, టీజీ క్యాబ్ డీజీఎం సురేఖను నియమించింది. ఇందులో అవధానుల శ్రీనివాస్ ఇంక్రిమెంట్లు, బదిలీలు, పదోన్నతులు, ఆడిట్, జీవిత బీమాపై సోమవారం విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. మరోపక్క టీజీ క్యాబ్ డీజీఎం సురేఖ మంగళవారం నుంచి విచారణ చేయనున్నట్లు తెలిసింది. రైతు రుణమాఫీ డీసీసీబీ పరిధిలో 1.69 లక్షలకు మందికి రూ.892 కోట్లు వర్తించాల్సి ఉండగా, కేవలం 68 వేల మంది రైతులకు రూ.274 కోట్లు అందాయి. ఈ విషయాన్ని టీజీ క్యాబ్ పరిశీలిస్తుండగా పరిణామాలు ఎటు దారి తీస్తాయోనన్న చర్చ జరుగుతోంది. ఆయా అంశాల్లో బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఉదయ్‌కుమార్ రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. బ్యాంకు ఉన్నతాధికారులపై ఒకటి, రెండు రోజుల్లో చర్యలు తీసుకునే అవకాశముందని ఓ అధికారి తెలిపారు.

వరదలో కొట్టుకుపోయిన పడవలు

బూర్గంపాడు: బూర్గంపాడు సమీపంలోని కిన్నెరసాని బ్రిడ్జి వద్ద నిలిపి ఉంచిన జాలర్ల పడవలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. కిన్నెరసాని బ్రిడ్జి వద్ద మూడు పడవలను నిలిపిన జాలర్లు ఒడ్డున్న నిద్రిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో కిన్నెరసాని గేట్లు ఎత్తడంతో వరద ఉధృతి పెరిగి పడవలు కొట్టుకుపోయాయి. కాగా, ఈ పడవలు పాములేరు వద్ద సోమవారం లభ్యమయ్యాయి. పడవల్లోని చేపలు పట్టే వలలు, నిత్యావసరాలు, వంటసామగ్రి వరద పాలయ్యాయని జాలర్లు తెలిపారు. తమకు రూ.60 వేల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

వరదలకు కుప్పకూలిన విద్యుత్ స్తంభాలు



లొద్దిగండివాగులో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

పాల్వంచరూరల్: భారీ వర్షాలు, వరదలకు 12 గేట్లు ఒక్కసారిగా ఎత్తి కిన్నెరసాని ప్రాజెక్ట్ నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో వాగు ఒడ్డున ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. మరో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు నీటమునిగినట్లు ఎన్‌పీడీసీఎల్ రూరల్ ఏఈ రవీందర్ తెలిపారు. కిన్నెరసాని వాగు ఒడ్డున, ఉల్వనూరు లొద్దిగండి సమీపంలో, ఇతర ప్రాంతాల్లో కలిపి మొత్తం 35 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సిబ్బంది అప్రమత్తమై రాత్రి వేళలో సైతం శ్రమించి మరమ్మతులు నిర్వహించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా సోమవారం చర్యలు తీసుకున్నట్లు ఏఈ తెలిపారు.

కొనసాగుతున్న వరద ఉధృతి



సీతారామ ప్రధాన కాలువ గండి వద్ద వరద నీటి ప్రవాహం

ములకలపల్లి/పాల్వంచరూరల్: 'సీతారామ'ప్రాజెక్ట్ ప్రధాన కాలువ గండి వద్ద వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. ములకలపల్లి, పాల్వంచ మండలాల సరిహద్దు వద్ద ప్రాజెక్ట్ కాలువకు ఆదివారం తెల్లవారుజామున భారీ గండి పడిన విషయం విదితమే. బీజీ కొత్తూరులోని పంప్‌హౌస్–1 నుంచి పూసుగూడెం శివారులోని పంప్‌హౌస్–2 వరకు 43 కిలోమీటర్ల పొడవున ప్రధాన కాలువ నిర్మించారు. కాగా కొత్తూరు సమీపంలో ఈ కాలువ ఎడమ పక్క గండి పడటంతో వరద ప్రవాహం దిగువకు పరవళ్లు తొక్కుతూ, ముర్రేడు వాగులో కలుస్తోంది. సుమారు రూ. 20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలిసింది. సుమారు 10 వేల క్యూసెక్కుల నీళ్లు దిగువకు వెళ్తున్నట్లు సమాచారం.

శాశ్వత పరిష్కారం చేపడతాం

సీతారామ కాలువ గండికి శాశ్వత పరిష్కారం చేపడతామని జలవనరులశాఖ సీఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. భారీవర్షాలతో సీతారామ కాల్వకు గండి పడ్డ ప్రదేశాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ గండిపడ్డ సీతారామ కాలువకు భవిష్యత్‌లో ముప్పు లేకుండా చర్యలు చేపడతామన్నారు. వరద ఉధృతి తగ్గాక తాత్కాలిక మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. కాలువ నిర్మాణ సమయంలోనే అక్కడ గేట్లను ఏర్పాటు చేస్తే ఇలా ప్రమాదం జరిగి ఉండేది కాదన్నారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా రూ.60 కోట్ల ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

బాధితులకు న్యాయం చేయాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు రూరల్: భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులను ఆదుకోవడంలో ప్రజాప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. సోమవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధితులను ఆదుకొని న్యాయం చేయాలని కోరారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా వరద బాధితులు ఇబ్బందులు పడటం విచారకరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరదలు వస్తే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని, హెలికాప్టర్ల ద్వారా సైతం సహాయక చర్యలు చేపట్టామని వివరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, రైతులకు పంట నష్టపరిహారం అందించాలని, మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి 5 క్వింటాళ్ల బియ్యం, 25 కేజీల పప్పు, వంటనూనె, ఇతర నిత్యావసరాలను అందజేయాలన్నారు. బీఆర్ఎస్ వరద బాధితులకు అండగా ఉండి సహాయక చర్యలు చేపడుతుందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు ముత్యంబాబు, అడపా అప్పారావు, ఎడ్ల శ్రీనివాస్, వట్టం రాంబాబు, కుంటా లక్ష్మణ్, ముద్దంగుల కృష్ణ, ఎన్.రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు

ముగ్గురిపై బైండోవర్ కేసులు

జూలూరుపాడు: నాటు సారా తయారీ, విక్రయదారులు ముగ్గురిపై ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు. మాచినేనిపేటతండాకు చెందిన లకావత్ శంకర్, సాయిరాంతండాకు చెందిన హలావత్ రాందాస్, మాచినేనిపేట గ్రామ పంచాయతీ గోపాతండాకు చెందిన గుగులోత్ దానిలను సోమవారం జూలూరుపాడు తహసీల్దార్ కె.స్వాతిబిందు ఎదుట హాజరు పరిచారు. ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ ప్రకాష్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఏడాది జైలుశిక్ష

ఖమ్మం లీగల్: రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఏపూరి బిందుప్రియ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రచారం... తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణికి చెందిన గుంటేటి రవికుమార్ తదితరులు 2015 జనవరి 17న ఆటోలో వెళ్తున్నారు. ఈక్రమంలో మెదక్ జిల్లాకు చెందిన మహ్మద్ జిలానీ వ్యాన్‌లో వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేపట్టిన ఖమ్మం రూరల్ పోలీసులు కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. దీంతో విచారణ అనంతరం జిలానీకి ఏడాది జైలుశిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి బిందుప్రియ తీర్పు చెప్పారు.

రూ.1.50లక్షల విలువైన కోడిపిల్లలు మృతి

పెనుబల్లి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పెనుబల్లి మండలం వీఎం బంజరులో ఫాంలో కోడిపిల్లలు మృతి చెందాయి. వీఎం బంజర బేడా బుడగ జంగం కాలనీ సమీపాన తూరపాటి అబ్బుస్వామి బాయిలర్ కోళ్లఫారం ఏర్పాటుచేశారు. వర్షాలతో ఫాంలోకి నీరు చేరగా రూ.1.50లక్షల విలువైన 2 వేలు కోడిపిల్లలు మృతి చెందాయని బాధితుడు తెలిపారు.



మృతి చెందిన కోడిపిల్లలు